# బంధుప్రీతి

గోడ గడియారం టంగ్... టంగ్ మని ఎనిమిది గంటలు కొట్టింది.

పార్వతి లేచి వెళ్లి వరండాలో నిల్చుంది.

శంకరం యింకా రాలేదేం ఆఫీసునుంచి యింటికి వచ్చి కాఫీ త్రాగి గాని ఎటూ వెళ్లడు. అలాంటిది ఈరోజు భోజనం వేళయినా అంతులేదు.

రోడ్డుమీద జనం పల్చబడ్డారు. అప్పుడప్పుడు ఒకళ్ళిద్దరు వెళ్తున్నారు. జీపులు, సైకిళ్ళు అరుదుగా పోతున్నాయి.

శంకరానికి నాగార్జునసాగర్‌లో ఉద్యోగం వచ్చి సంవత్సరం దాటిపోయింది. ఇక్కడ చేరిన తర్వాత నెలకే పార్వతితో పెళ్ళయ్యింది. పెళ్లంటే పెద్దలు చేసిందికాదు కులం ఒకటికాదనే సాకుతో పెద్దవాళ్ల ఒప్పుకోలేదు. శంకరం అందరినీ ఎదిరించి పార్వతిని పెళ్లి చేసుకున్నాడు.

పార్వతికి రోజులు ఆనందంగానే గడిచి పోతున్నాయి భర్త ఇంట్లో వున్నంత సేపూ స్వర్గంలో వున్నట్లు అనుభూతి పొందుతుంది కాని అతను ఆఫీసుకి వెళ్లిపోగానే ఆమె ఒంటరిదై పోతుంది. ఏమీ తోచదు, అంతులేని దిగులు ఆమెను ఆవహిస్తుంది వెన్నెలకోసం ఎదురుచూసే చకోరిలా ఆమె, శంకరం రాకకోసం చూస్తూ వుంటుంది.

సంవత్సరం దాటిపోయినా అటు శంకరంపైపువాళ్లగాని, ఇటు పార్వతి తల్లిదండ్రులుగాని ఎవరూ రాలేదు. కనీసం ఎలావున్నారని కార్డు ముక్కగూడా రాయలేదు. అభిమానం వదులుకుని పార్వతి తండ్రికి, అన్నయ్యకు ఉత్తరాలు రాసింది. అయినా వాళ్ల జవాబు యివ్వలేదు. నెలరోజులపాటు ఆమె కళ్ల కాయలుకాసేలా ఎదురుచూసింది. ఇంటి దగ్గర్నుంచి

అన్నగాని, తండ్రిగానీ ఉత్తరం రాస్తారేమోనని. ఊహూం.... రాయనేలేదు. ఇటు శంకరం తమ్ముడు రామారావు పెళ్లి జరిగింది యీమధ్య. పెళ్లికి తమను తప్పకుండా పిలుస్తారని ఆశపడింది పార్వతి. ఆమె ఆశ నిరాశే అయ్యింది. తమ్ముడి పెళ్లికి శంకరాన్ని పిలవలేదు. పార్వతికి దుఃఖం ఆగ లేదు. నిజానికి శంకరం తల్లిదండ్రులుగాని, తమ్ముళ్ళు, చెల్లెళ్లు గాని ఎలా వుంటారోగూడా పార్వతికి తెలియదు. ఎప్పుడూ చూడనేలేదు వాళ్లని.

గడియారం అరగంట కొట్టింది.

గతంలోంచి తేరుకుంది పార్వతి.

శంకరం ఇంకా రాలేదేం ?

దూరంగా రెండు ఆకారాలు ఇటే వస్తున్నాయి.

రాను రాను వాళ్లు దగ్గిరయ్యారు.

స్ట్రీట్ లైట్ వెలుగులో అతను శంకరంలాగే వున్నాడు. కాని ప్రక్కన ఆమె ఎవరు ? సన్నగా సన్నజాజి తీగలా వున్నది.

ఆమె ఎవరో పార్వతి వూహకి అందలేదు.

దాదాపుగా ఇంటి ముందుకు వచ్చారు. అతను శంకరం కాదు. కాని అతనిలో శంకరం పోలికలు కన్పించాయి. అ నొక్కు నొక్కుల జుట్టు, కొనదేరిన ముక్కు, అంతా శంకరమే. అతని చేతిలో సూట్ కేసు, భుజానికి కెమేరా వున్నాయి.

వాళ్లు వచ్చి సరిగా ఇంటిముందు ఆగారు.

లోపలకు రాబోయి ఎందుకో ఆగిపోయాడు అతను. ఆమె రోడ్డు మీదే నిల్చునివుంది. వాళ్లు పార్వతివంక చూస్తూ, ఆమెను ఏమిటో అడగ డానికి సందేహిస్తున్నారు.

పార్వతికి ఆశ్చర్యం వేసింది. ఎవరు వీళ్లు ? ఇంట్లోకి రాబోయి ఆగిపోయారెందుకు ?

ఒకవేళ శంకరం తమ్ముడు రామారావు, అతని భార్య కాదుగదా!!

పార్వతి ముఖం సంతోషంతో విప్పారింది.

వరండా నుంచి రెండు మెట్లు క్రిందకు దిగి "ఎవరు మీరు ?" అంది.

"మేం గుంటూరు నుంచి వచ్చాం. నా పేరు రామారావు...."

పార్వతి హృదయంలో పన్నీటిజల్లు కురిసినట్లయింది అర్ధోక్తిలోనే అందుకుని "రండి....రండి ..." అంటూ లోపలకు ఆహ్వానించింది.

ఇద్దరూ హాల్లోకి వచ్చాక, కుర్చీలు చూపించి "కూర్చోండి...." అంది.

"శంకరం...." అన్నాడు రామారావు.

"ఆయన ఇంకా రాలేదు. రోజూ ఆఫీసునుంచి ఆరుగంటల లోపే వచ్చేవారు. ఈరోజు ఎందుకనో ఆలస్యం చేశారు. వచ్చేస్తారులెండి.... ముందు మీరు స్నానాలు చెయ్యండి. వేడినీళ్ల తోడుతాను...." అంటూ లోపలకు వెళ్లబోయింది పార్వతి.

వేడినీళ్లెందుకు ? ఎండకాలమేగా. చన్నీళ్ల స్నానం చేస్తాంలెండి." అన్నాడు రామారావు.

పార్వతి అతని మాటలు వినిపించుకోలేదు.

"రా అమ్మాయి. అన్నట్లు నీ పేరేమిటి ?" అంది.

"ఆమె చిన్నగా నవ్వి "సుమతి." అంది.

పార్వతి సుమతిని లోపలకు తీసుకెళ్లి బెడ్‌రూమ్ చూపించింది.

రామారావు, సుమతి స్నానంచేసి డ్రెస్‌చేసుకుని "అలా వెళ్లివస్తామండి!" అన్నారు.

"అలా బైటకువెళ్లి గెస్ట్ హౌస్ కాంటీన్‌లో భోజనంచేసి వస్తాం." అన్నాడు రామారావు.

పార్వతి కోపంగాను, చిరాకుగాను చూసింది.

"ఏం మా యింట్లో తినగూడదా ?" అంది సీరియస్‌గా.

భార్యాభర్తలు ఒకరి మొఖం మరొకరు చూసుకున్నారు.

"ఏం రామారావ్ ? మాట్లాడవేం ?"

రామారావు ఎందుకో ఆశ్చర్యపోయినట్లు చూశాడు. తర్వాత లేని చిరునవ్వు తెచ్చిపెట్టుకుని "అబ్బే ... అదేంకాదు. ఈ వేళప్పుడు మిమ్మల్ని శ్రమపెట్టడం ఎందుకూ అని ?" అన్నాడు.

"ఇందులో శ్రమ ఏముంది ? కూరలు రెడీగా వున్నాయి. అన్నం ఉడుకుతున్నది. పది నిముషాలు ఆలస్యం అంతే." అని రేడియో ట్యూన్ చేసి లోపలకు వెళ్లిపోయింది పార్వతి.

కిషోర్‌కుమార్ "రూప్‌తెరా మస్తానా" పాట వస్తోంది.

రామారావు, సుమతి పాట వింటూ నెమ్మదిగా మాట్లాడుకుంటున్నారు.

పార్వతి స్టౌ ముందు కూర్చుని ఆలోచిస్తోంది—

రామారావు తల్లిదండ్రులకు చెప్పే వచ్చాడా ? ఉహూఁ! చెప్పి వుండడు. చెప్తే వెళ్లనివ్వరని భయపడివుంటాడు. ఎంతైనా అన్నదమ్ముల ఆప్యాయతలు వేరు. తల్లిదండ్రుల మూర్ఖపు పట్టుదలలు వేరు. ఈ విధంగానైనా అన్నదమ్ముల మధ్య రాకపోకలు జరుగుతూ వుంటే, క్రమంగా పిల్లలు పుట్టాకనైనా అత్తమామలు రాకపోరు. పార్వతి హృదయంలో ఒక ఆశాకిరణం వెలిగింది.

గోడ గడియారం తొమ్మిదిగంటలు కొట్టింది.

శంకరం ఇంకా రాలేదు. పార్వతికి ఆకలిగూడా వేస్తోంది.

రామారావుకి, సుమతికి వడ్డించింది.

ఆమెను గూడా వడ్డించుకోమని రామారావు బలవంతం చేశాడు.

పార్వతి సిగ్గుపడుతూనే కూర్చుంది.

మౌనంగా భోజనం చేస్తున్నారు.

"మా పెళ్లయి మూడు నెలలయింది." అన్నాడు రామారావు ఏదో ఒకటి మాట్లాడలని.

పార్వతి నవ్వింది.

"అప్పట్నుంచి నాగార్జునసాగర్ వెళ్ళి చూద్దామని ఒకటే గొడవ. ఇప్పటికి తీరింది...." అన్నాడు రామారావు.

"నాకు హిస్టరీ అంటే ఇంట్రెస్టు అక్కయ్యగారూ! ఇలాంటి చారిత్రక ప్రదేశాలు చూడడం అంటే నాకు భలే సరదా. కొండపల్లి, కొండవీడు, అజంతా, ఎల్లోరా దౌలతాబాద్, గోల్కొండ చూశాను. దగ్గరే ఐనా నాగార్జున చూడటం పడలేదు" అంది సుమతి.

తర్వాత ఆ కబుర్లూ, ఈ కబుర్లూ చెప్పుకున్నారు.

ఇంటి విషయాలు అడగాలనీ, తమగురించి అత్తమామల అభిప్రాయములో ఏదైనా మార్పు వచ్చిందేమో తెలుసుకోవాలని వుంది పార్వతికి. కాని రామారావైనా ఆ విషయాలు మాట్లాడతాడేమోనని ఆశపడింది ఊహూఁ! అతను తూచి తూచి మాట్లాడుతున్నాడు. సుమతి కూడా అంతే. భర్త మాటలకు తందాన....తాన.... అంటూ వుంది.

"ప్రయాణంచేసి వచ్చారు ఇక పడుకోండి" అంది పార్వతి.

అప్పటికి పదిన్నరయింది.

గంట తర్వాత వచ్చాడు శంకరం.

"ఫ్రెండ్స్ బలవంతం చేస్తే సినిమాకి వెళ్ళాను. పార్వతీ"

పార్వతి నవ్వింది.

"మిమ్మల్ని సంజాయిషీ ఎవరడిగారు ?" అంది.

శంకరం బెడ్‌రూమ్ వైపు వెళ్ళబోతుంటే "ఆగండి....ఆగండి! అందులో బంధువులున్నారు" అంది.

"బంధువులా ? ఎవరూ?" అన్నాడు ఆశ్చర్యపోతూ.

"చెప్పుకోండి చూద్దాం"

"ఇప్పుడు ఆలోచించే ఓపిక లేదులే. ఎవరూ?"

"మీ తమ్ముడు రామారావు సతీసమేతంగా వచ్చాడు"

శంకరం మొఖం సంతోషంతో వికసించింది.

"నిజమా?" అన్నాడు నమ్మలేనట్లు చూస్తూ.

* 2

తెల్లవారింది.

శంకరం కొంచెం ఆలస్యంగా లేచాడు.

అతను లేచేసరికి రామారావు, సుమతి స్నానాలు గూడా చేసేశారు. పార్వతి వేడివేడి ఉప్మాపెట్టి కాఫీలు యిచ్చింది.

శంకరం లేచి వరండాలో నిల్చుని బ్రషతో పళ్ళు తోముకుంటున్నాడు.

రామారావు నెమ్మదిగా వరండాలోకి వచ్చాడు.

శంకరం అతన్ని చూశాడు.

అంతే! శంకరం మొఖం వెలవెలా పోయింది. అతను తనతమ్ముడు కాదు. ఎవరో? అతన్ని ఇంతకుముందెన్నడూ చూసిన గుర్తుగూడా లేదు.

శంకరం మతిపోయినట్లు చూశాడు.

"రాత్రి గుంటూరునుంచి వచ్చామండీ శంకరంగారూ! గెస్టుహౌస్‌లో ఒక్క రూమూ దొరకలేదు. అన్నీ రిజర్వేషన్ అయిపోయాయి. మాకు ఏం చేయాలో తోచలేదు ఎవరయినా తెలిసినవాళ్ళు కల్పిస్తారేమోనని కాలనీలోకి వచ్చాము. ఆ సమయానికి అక్కయ్యగారు వరండాలో నిల్చుని వున్నారు.

మీపేరు నేమ్‌ప్లేట్ మీద చూశాను మీరున్నారేమోనని అడిగాను. నేను అసలు విషయము చెప్పకుండానే అక్కయ్యగారు మా యిబ్బంది గ్రహించి నట్లున్నారు. ముక్కూ మొఖం తెలియనివాళ్ళమైనా మమ్మల్ని బంధువుల కన్నా మిన్నగా ఆదరించారు. వారి మంచితనాన్ని మాటలతో చెప్పలేము. కలియుగములో అక్కయ్యలాంటివారు నూటికి, కోటికి ఒకళ్ళుంటారేమో, చాలా థాంక్స్. మీ ఆదరణ ఈ జన్మలో మరువలేము" అన్నాడు రామారావు.

శంకరం తేరుకున్నాడు.

జరిగిన పొరపాటు అర్థమైంది.

చిరునవ్వు తెచ్చుకుని "దానికేముందండి. ఇప్పుడు మేము చేసిందే ముంది? మా పార్వతికి అతిధులంటే చాలా యిష్టం" అన్నాడు.

"వస్తామండీ అక్కయ్యగారూ, మీరెప్పుడైనా గుంటూరు వచ్చిన ప్పుడు మా ఇంటికి తప్పకుండా రావాలి" అన్నాడు రామారావు.

"డామ్, నాగార్జునకొండ చూసి అటేవెళ్ళిపోతాము. గుంటూరువస్తే మమ్మల్ని మర్చిపోకండి" అని అడ్రసు రాసిఇచ్చింది సుమతి.

పార్వతి వెళ్ళిపోతున్న వారిపంక చూసి కళ్ళనీళ్లు పెట్టుకుంది.

ఆమె ఎందుకు అంత బాధపడుతుందో రామారావుకి అర్థం కాలేదు.

శంకరానికి అర్థమై విరక్తిగా నవ్వుకుని "వాడెందుకు వస్తాడు" అను కున్నాడు.

*

ఆంధ్రసచిత్ర వారపత్రిక, 3-9-76